నేడు హనుమాన్ జయంతి వేడుకలు

రాయదుర్గం: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక వేడుకలను శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా ఉదయం 8 గంటలకు సహస్రనామ పూజను నిర్వహిస్తారు. 6.30 గంటలకు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం భక్తులచే చేయిస్తారు. తర్వాత జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని పురవీధులలో పల్లకీసేవ, అనంతరం ఆలయంలో మహామంగళ హారతి, ఊంజల్‌సేవ, పవళింపు వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు నిరసనగా ర్యాలీ



శేరిలింగంపల్లి: వక్ఫ్ బోర్డు చట్ట సవరణను ముస్లింలు నిరసిస్తూ శేరిలింగంపల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. శేరిలింగంపల్లి మోతీ మసీద్, నెహ్రూనగర్ నుంచి ర్యాలీగా బయలుదేరి తారానగర్ మసీద్ ద్వారా, నల్లగండ్ల ఆర్‌టీబీ వరకు, అక్కడ నుంచి భెల్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అంతకు ముందు మధ్యాహ్నం మసీద్‌లలో నమాజ్ పూర్తయిన తర్వాత నిరసన ర్యాలీ నిర్వహించారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



మియాపూర్: అసంపూర్తి పనులతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశ్వేశ్వరయ్య కాలనీ వద్ద రోడ్డు గుంతలుగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి గుంతలను పూడ్చటంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ సర్వే నం.27లోని తెలంగాణ కాలనీలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ నేలమట్టం చేశారు. స్థానిక బీజేపీ నాయకుడు బాలయ్య ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.



రైల్ విహార్ కాలనీలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

సీసీతో మురిసి..

దశలవారీగా అంతర్గత రోడ్లన్నీ సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియ

- శేరిలింగంపల్లి సర్కిల్‌లో చురుగ్గా కొనసాగుతున్న నిర్మాణం
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో 63 సీసీరోడ్లకు నిధులు
- పూర్తి చేసినవి 36, ప్రగతిలో ఉన్నవి ఏడు
- ఇంకా ప్రారంభించాల్సినవి 20 సీసీరోడ్లు

శేరిలింగంపల్లి: కొన్నేళ్లుగా అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 63 సీసీరోడ్డు పనులకు రూ.2,810.85 కోట్లు మంజూరు కాగా అందులో 36 సీసీరోడ్లు పూర్తి చేయగా ఏడు సీసీ రోడ్లు ప్రగతిలో ఉన్నాయి. 20 సీసీరోడ్లు ప్రారంభించాల్సి ఉంది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి మూడు డివిజన్లు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా గచ్చిబౌలిలో 14 సీసీరోడ్లు పూర్తిగా చేయగా ఇంకా మూడు ప్రగతిలో ఉన్నాయి. మరో ఆరు సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. భారతినగర్ డివిజన్‌లో కొంత ప్రాంతమే ఉండగా అందులో ఒక సీసీరోడ్డు పూర్తి చేయగా ఇంకా రెండు పనులు చేయాల్సి ఉంది. కాగా కొండాపూర్‌లో 10 పనులు పూర్తిచేయగా మరో ఆరు పనులు చేపట్టాల్సి ఉండగా, శేరిలింగంపల్లిలో 11 పనులు పూర్తయ్యాయి. నాలుగు ప్రగతిలో ఉండగా మరో ఆరు పనులు చేపట్టాల్సి ఉంది.

సీసీరోడ్లు చేపట్టే ముందు చేయాల్సినవి ఇవే..

- ప్రతికాలనీలో సీసీరోడ్లు నిర్మాణం చేసేముందు ఆ రోడ్డుపై డ్రైనేజీ కాల్వ నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ పూర్తయ్యాక సీసీరోడ్లు వేయాలి.
- సీసీరోడ్లను 'వాల్ టు వాల్'గా వేయాలని స్థానికులు కోరుతున్నారు.
- నాలుగు కాలాల పాటు ఉండేలా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.
- రోడ్లు వేశాక మొక్కుబడిగా కాకుండా వాటర్ క్యూరింగ్ నిబంధనల ప్రకారం చేయాలి.
- సీసీరోడ్లు వేసే సమయంలో నాణ్యత పరిశీలించి సంబంధిత అధికారుల పర్యవేక్షణలోనే రోడ్ల నిర్మాణం చేసేలా చూడాలి. ప్రజాప్రతినిధులు కూడా పర్యవేక్షించాలి.
- క్యూరింగ్ ప్రక్రియపై కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి.

నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి



కాలనీలు, బస్తీలలో వేసే సీసీరోడ్ల నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. నాలుగు కాలాల పాటు ఉండేలా చేయాల్సిన బాధ్యత అధికారులదే. ప్రజాప్రతినిధులు కూడా పర్యవేక్షించాలి. అంతేకాకుండా కాలనీ, బస్తీవాసులకు సమాచారం ఇచ్చి వారు కూడా పర్యవేక్షించేలా చేస్తేనే నాణ్యతతో కూడినవిగా నిర్మాణం చేయడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి. – బద్దం కొండల్‌రెడ్డి, అధ్యక్షుడు, పాపిరెడ్డి కాలనీ

అంతర్గత రోడ్లన్నీ సీసీ రోడ్లుగా..

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలోని కాలనీలు, బస్తీలలోని అన్ని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చాలన్నదే లక్ష్యం. అందుకోసం ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దశలవారిగా మంజూరు అవుతున్న నిధులను బట్టి పనులను చేపట్టి పూర్తి చేస్తున్నాం. అన్నీ రోడ్ల పనుల్లో నాణ్యత పాటించేలా చూస్తున్నాం.
– ఆనంద్, డీఈ, శేరిలింగంపల్లి సర్కిల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

- అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. ఆయన నివాసంలో శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలోని డివిజన్లలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, ఇతర అన్ని విభాగాల అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై వెంటనే స్పందించి వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజావసరాల దృష్ట్యా కాలనీలలో నెలకొన్న రోడ్ల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యతగా పరిగణనలోకి తీసుకొని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. పనుల్లో వేగం పెంచాలని అలసత్వం ప్రదర్శించకూడదని, పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు అన్ని పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం ఉన్న చోట త్వరగా రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కాలనీలలో చేపట్టే ప్రతి పని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ జీకేడీ ప్రసాద్, ఈఈ ఇంద్రబాయి, డీఈలు ఆనంద్, దుర్గాప్రసాద్, విశాలాక్షి, ఏఈలు ప్రశాంత్, ప్రతాప్, సంతోష్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామస్వామి యాదవ్ తదితరులు

చందానగర్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకొని చందానగర్‌లోని డఫ్ అండ్ డమ్ స్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఆధునిక యుగ వైతాళికుడు, ప్రథమ సామాజికవేత్త మహాత్మా జ్యోతిబా పూలే అని కొనియాడారు. అంటరానితం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ మెర్సీ, అధ్యాపకురాలు శోభ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరాజు, పాలం శ్రీను, బాలరాజు, జనార్దన్, జిల్ మల్లేష్, సుబ్బయ్య, చంద్రశేఖర్, విజయానంద్ పాల్గొన్నారు.

20న 'మనూ'లో ఉపాధ్యాయుల ఉద్యోగ మేళా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల కోసం 'మనూ' ప్రత్యేక ఉద్యోగ మేళా కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తామని 'మనూ' ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. 'మనూ'లో రెగ్యులర్, డిస్టెన్స్ మోడ్‌ల విద్యార్థులు, ఇతర అర్హత కలిగిన అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫ్యాకల్టీ అవసరాలు/ఖాళీలు ఉన్న ఆసక్తిగల కళాశాలలు/పాఠశాలలు/విద్యా సంస్థలు ఈ నెల 18వ తేదీ నాటికి రూ.5వేల రిజిస్ట్రేషన్ ఫీజుతో పాల్గొనాలని సూచించారు. ఈ జాబ్ మేళాలో సంస్థలు, తమ పాఠశాలలు/సంస్థలకు సమర్థులైన ఉపాధ్యాయులు/మానవ వనరులను పొందడానికి సహాయ పడుతుందన్నారు. అనేక కళాశాలలు/పాఠశాలలు/సంస్థలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనే అవకాశం ఉందని వివరించారు. వివరాలకు ఫోన్: 9848171044, 8688477911, 9044145228లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆస్తి పన్ను వసూళ్లలో చందానగర్ సర్కిల్‌కు నాల్గవ స్థానం



రెవెన్యూ విభాగాల అధికారులను సన్మానిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్: జీహెచ్‌ఎంసీ పరిధిలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను వసూళ్లలో చందానగర్ సర్కిల్ 21 నాల్గవ స్థానంలో నిలిచింది. శుక్రవారం చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డితో పాటు రెవెన్యూ విభాగం అధికారులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి రూ.109.54 కోట్లు వసూలు చేశామన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు కృషితోనే ఈ ఘనత సాధించామన్నారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీ వరకు చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. కేవలం 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుకు మాత్రమే ఎర్లీ బర్డ్ స్కీం వర్తిస్తుందన్నారు. సెలవుల రోజులలో కూడా ఆస్తి పన్నులు చెల్లించవచ్చన్నారు. రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సెలూన్‌లో సందడి



శేరిలింగంపల్లి: హెయిర్ కటింగ్‌తో అందంగా కనిపిస్తామని, ఈ సెలూన్ చాలా బాగుందని యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగండ్లలోని హుడా లేఅవుట్‌లో ప్రీమియ యూనిసెక్స్ సెలూన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సెలూన్‌లో అభిమానులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన షురూ



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రదర్శన ఈనెల 13వ తేదీ వరకు ఉంటుందని, 40 చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

ఆల్విన్‌కాలనీ: శ్రీమణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో పంచమి కాలనీ శ్రీమారెమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఉత్తరణక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్పస్వామి మహా పడిపూజ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా గచ్చిబౌలి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీవీకాలనీ, గౌలిదొడ్డి, అపర్ణా, శాంగ్రిల్లా, కేశవ్‌నగర్, జయభేరి ఫోర్త్‌ఫేజ్, పద్మశ్రీగార్డెన్, ఐఎల్ఎస్‌పార్కు, జయభేరి ఎన్‌క్లేవ్, ఏపీహెచ్‌బీ కాలనీ ఫోర్త్ ఫేజ్, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నంబర్-3, యూనివర్శిల్ రియాల్టర్స్, టీజీఐఐసీ, వైఎస్సార్‌భవన్, నానక్‌రాంగూడ, హనుమాన్ టెంపుల్, ఎస్సీ బస్తీ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు

- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖాజాగూడ, ఏసీ అట్లాంటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్ సెక్షన్ కాలనీ, ఓక్రిడ్జ్ స్కూల్, కుమ్మరిబస్తీ, ఐశ్వర్య కాలనీ, మీనాక్షి, ఎల్‌అండ్‌టీ పార్క్, సాయిబాబా దేవాలయం, టెలికామ్‌నగర్, ప్రశాంతిహిల్స్, ఎంజేఆర్‌దాబా వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్ సెక్షన్ పరిధిలో..

- చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- మార్తాండనగర్, ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ల పరిధిలో ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, ప్రకాష్‌నగర్, వినాయక నగర్, మార్తాండ నగర్, న్యూ హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో వైశాలీనగర్, ఏపీజీఓ ఎస్ కాలనీ ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో..

- హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, గ్రీన్ బవార్జి ఏరియాలలో..
- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆదిత్యనగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ఏరియాలలో..
- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10.30 వరకు ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు, టూగెదర్ మెట్స్ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్ ఫేజ్ 1, 2, 3, 4, 5 జనప్రియనగర్, భాను టౌన్‌షిప్, సితార గ్రాండ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.
- సాయిరాం నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు ప్రజయ్ సిటీ అపార్ట్‌మెంట్స్, ఇండస్ట్రీయల్ ఏరియా, కుమ్మరి బస్తీ, జనప్రియనగర్, ఎన్‌డ్కో బిల్డర్స్, అపర్ణ విల్లాస్, డబుల్ బెడ్‌రూమ్‌లు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వేమనకాలనీ సెక్షన్‌లో..

- వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- భవానీపురం ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాజేందర్‌రెడ్డి కాలనీ, అమీన్‌పూర్ మెయిన్ రోడ్డు, పద్మజ కాలనీ ఏరియాలలో..
- కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 వరకు కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్(జనప్రియ టౌన్‌షిప్ నుంచి అయ్యప్ప స్వామి టెంపుల్), పీజేఆర్ రోడ్డు నెంబర్ 2, 4, 6, 8 ప్రాంతాలలో..
- ఎస్టీపీ ప్లాంట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఎస్టీపీ ప్లాంట్, భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్, శంకర్‌నగర్ ప్రాంతాలలో..
- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో..
- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్, కేఎస్ఆర్ ఏరియా అయ్యప్ప స్వామి టెంపుల్ నుంచి అపర్ణ రోడ్డు, ఇక్రిశాట్ కాలనీ ఏరియాలలో..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్‌నగర్ రోడ్డు నెంబర్ 4, 5, 6 కైలాష్‌నగర్ శ్రీదేవి థియేటర్, ఎస్వీఎస్ ఇన్ఫ్రా లిమిటెడ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలు ఫీడర్ల పరిధిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు నల్లగండ్ల హుడా, నల్లగండ్ల మెయిన్ రోడ్డు, నల్లగండ్ల విలేజ్, లేక్ వ్యూ అపార్టుమెంట్స్, సిటిజన్ హాస్పిటల్, రత్నదీప్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్ 1, ఫేజ్ 2 కాలనీలు, డిఫెన్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్, డాక్టర్స్ కాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో..

- మియాపూర్: మదీనాగూడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు స్వర్ణపురి కాలనీ రోడ్డు నంబర్-1 నుంచి రోడ్డు నంబర్ 14 వరకు మక్తమహబూబ్‌పేట్, జనప్రియ వెస్ట్ సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, పీఏనగర్, కృషినగర్, ప్రశాంత్‌నగర్, రాఘువేంద్ర మిత్రా అపార్ట్‌మెంట్స్, రాఘువేంద్ర పాంచా జెన్యా అపార్ట్‌మెంట్స్, జేపీనగర్, నాగార్జున ఎన్‌క్లేవ్, ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీ అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దీప్తీశ్రీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతుల సమస్యలను పరిష్కారానికి తన వంతు చేస్తున్నా నని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల రైతు వేదిక కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు మద్దతు ధర ఇచ్చేందుకు రైతు కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయిస్తే నష్టపోతారని తెలిపారు. రైతులందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ప్రభుత్వం సన్న రకం వడ్ల పైన క్వింటాలకు రూ.2320తో పాటు అదనంగా రూ.500 బోనస్‌గా చెల్లిస్తుందని తెలిపారు. దీనిని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, నాయకులు దేవేందర్ యాదవ్ పాల్గొన్నారు.